## క్లుప్తంగా

### ఉద్యోగి మృతికి సంతాపం


సత్యనారాయణ(ఫైల్)

జి.మాడుగుల: అనకాపల్లి జిల్లా కశింకోట మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.మాడుగుల మండలంలోని వంతాల పంచాయతీకి చెందిన జవ్వాది వెంకట సత్యనారాయణ(చిన్ని) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన అనారోగ్యంతో విశాఖ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. సత్యనారాయణ భౌతికకాయానికి వివిధ పార్టీల నాయకులు తదితరులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

### విద్యార్థికి అభినందనలు


ఆనంద్

రాజవొమ్మంగి: ఎటపాక నవోదయ విద్యాలయంలో రాజవొమ్మంగికి చెందిన విద్యార్థి అయినవిల్లి ఆనంద్ ప్రవేశ పొందాడు. ఈ మేరకు విద్యాలయంలో రెండు రోజుల క్రితం చేరినట్టు విద్యార్థుల తల్లిదండ్రులు నూకరాజు, శాంతి చెప్పారు. రాజవొమ్మంగి జెడ్పీహెచ్‌ఎస్‌లో అభ్యసించిన ఆనంద్ పదో తరగతిలో 527 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా ఆనంద్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

### పశువ్యాధులపై అప్రమత్తం


పశువును పరీక్షిస్తున్న సిబ్బంది

గంగవరం: మండలంలోని మొల్లేరులో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సర్పంచ్ కంజం లక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భం దాల్చని ఆవులు, గేదెలను సకాలంలో పశువైద్యాధికారితో వైద్యం చేయించాలని సూచించారు. రైతులు పశు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ శిబిరంలో 42 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స జరిపి మందులు ఉచితంగా పంపిణీ చేసినట్టు రంపచోడవరం ఇన్‌చార్జి ఉప సంచాలకుడు డాక్టర్ ఎస్.సూర్య నారాయణమూర్తి తెలిపారు.

### 350 మందికి దంత వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మారేడుమిల్లి: మండలంలోని చట్లవాడ పంచాయతీ బోదులూరు గ్రామంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పాస్టర్ బాబ్ రెజి విక్టర్స్ జ్ఞాపకార్థం, ది లైఫ్ చర్చి (బొమ్మూరు ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 350 మందికి దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కాకినాడ చెందిన ఏలిట్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ అద్దాల రాజ రత్నకర్, సిబ్బంది వైద్య సేవలందించారు. యూత్ సభ్యులు ప్రమోద్, సుందర్ పాల్, ప్రదీప్, నవకాంత్, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

### దసరా వేడుకలకు ముహూర్తపు రాట


పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు: సీలేరు మార్కెట్ సెంటరులో విజయ దుర్గా కమిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల ముహూర్తపు రాటను వేశారు. దేవి నవరాత్రులను అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా వేడుకలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భవానీ మాలధారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# లాభసాటి పంటలపై ప్రత్యేక దృష్టి


ఏబులం గ్రామంలో మాట్లాడుతున్నచింతపల్లి వ్యవసాయశాఖ ఏడీ కంటా జాహ్నవి


చింతపల్లిలో రైతులకు సూచనలిస్తున్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త బిందు


తాసరుబయిలులో మాట్లాడుతున్న సర్పంచ్ హనుమంతరావు


దాలిగుమ్మడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో లీలావతి, చిత్రంలో సర్పంచ్ పూర్ణిమ


జిల్లేడులో రైతులకు సూచనలిస్తున్న రైతుసాధికార సంస్థ ఎంసీఆర్పీ అప్పలరాజు

- గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం
- పొలాలను పరిశీలించిన అధికారులు
- సాగుపై రైతులకు అవగాహన

గూడెంకొత్తవీధి: అల్లూరి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, పర్యావరణవేత్తలు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని పొలాలను పరిశీలించి పంటల సాగుపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పంటల సాగుకు ముందుగా భూసారీ పరీక్షలు చేసుకొని, అందుకు అనుగుణంగా పంటలు వేయాలన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి పంటల సాగు చేపట్టాలని సూచించారు. సేంద్రియ ఎరువులు వినియోగించాలని, దీంతో భూసారం బాగుంటుందని, తద్వారా దిగుబడులు పెరుగుతాయన్నారు. జీవామృతం కషాయం వినియోగం వల్ల తెగుళ్ల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. గూడెం కొత్తవీధి మండలం ఏబులం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో చింతపల్లి వ్యవసాయశాఖ ఏడీ కంటా జాహ్నవి మాట్లాడుతూ గిరిజన రైతులు లాభసాటి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంత వాతావరణం అన్ని రకాల పంటల సాగుకు అనుకూలంగా ఉందన్నారు. ఉద్యాన, సుగంధ ద్రవ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.


కొయ్యూరులో రైతులకు సూచనలిస్తున్న ఏవో ఉమాదేవి


అరకులో మాట్లాడుతున్న సర్పంచ్ శారద


కురిడిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో నీలవేణి


బండిగడ్డలో రైతులకు విత్తనాలిస్తున్న ఏఓ ఉషారాణి

అగ్రిల్యాబ్ ఏఓ పద్మశోభ, ఏపీసీఎన్‌ఎఫ్ రాజుబాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది అరుణ, సంగీత, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని అంజలి శనివారం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త బిందు మాట్లాడుతూ యాంత్రిక పద్ధతిలో సాగుతో తక్కువ ఖర్చు అధిక దిగుబడి, మంచి లాభాలు పొందవచ్చన్నారు. ఏవో శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి మాలిని, సర్పంచ్ రాజబాబు, ఎంపీటీసీ సభ్యుడు వెంగళరావు, వీహెచ్ఏ రవి రైతులు పల్గొన్నారు.

జి.మాడుగుల: మండంలోని సొలభం పంచాయతీ తాసరబయిలులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఐసరం హనుమంతరావు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం చేపట్టాల్సి ఉందన్నారు. ఆధునిక పద్ధతులు అవలంబించాలన్నారు. వీహెచ్ఏ సతీష్,మండల యూనిట్ ఇన్‌చార్జి మహేశ్వరి, ఐసీఆర్పీ చంద్రకళ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని కొమ్మిక, కన్నంపేట గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏవో ఉమాదేవి మాట్లాడుతూ వరి పంటకు వచ్చే తెగుళ్లు, వాటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు మాట్లాడుతూ తమ ప్రాంతాల్లో జీడిమామిడి సాగు ఎక్కువగా ఉందని, జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏవో ఉమాదేవిని కోరారు. ప్రజాప్రతినిధులు,వ్యవసాయ సిబ్బంది సుబ్బారావు,పెంటన్న పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని అరకు, కురిడి పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో ఏవో నీలవేణి, సర్పంచ్ శారత మాట్లాడుతూ పశువుకు టీకాలు వేయించాలని సూచించారు. జీవామృతం కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ఎహెచ్‌ఎస్ శెట్టి.త్రినాథరావు, రమేష్, ఎంపీవో దేవి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని దాలిగుమ్మడి, ములియపుట్టు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏవో లీలావతి మాట్లాడుతూ వరితో పాటు పసుపు, అల్లం, మిరియాలు, రాజ్‌మా, రాగులు, పిప్పళ్లు తదితర పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని చామగడ్డ, బండిగడ్డ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏవో ఉషారాణి మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని, భూసార పరీక్షలు చేయించుకొని పంటలు వేయాలని సూచించారు. పశువైద్యాధికారి వీరేంద్ర మాట్లాడుతూ పశువులు వ్యాధుల బారిన పడితే తక్షణమే తమకు సమాచారం అందించాలన్నారు. రైతులకు మినుములు విత్తనాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మధుసూధనరాజు సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ సాధికార సంస్థ ఎంసీఆర్పీ అప్పలరాజు మాట్లాడుతూ సేంద్రియ కషాయాల పిచికారీతో పంటలకు తెగుళ్ల నివారించుకోవచ్చన్నారు. ఐసీఆర్పీలు లోవరెడ్డి, పాపారావు, సత్యనారాయణ, లోవశాంతి తదితరులు పాల్గొన్నారు.

# వ్యసనాలకు దూరంగా ఉండాలి


కూనవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కన్నప్పరాజు


మారేడుమిల్లిలో మాట్లాడుతున్న గుర్తేడు ఎస్ఐ సాయికుమార్


రంపచోడవరంలో మాట్లాడుతున్న ఎస్ఐ మోహన్‌కుమార్


రాజవొమ్మంగిలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

కూనవరం: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను ఎటపాక సీఐ కన్నప్పరాజు బుధవారం సందర్శించారు. వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు విద్యార్థులు, యువతీ, యువకుల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు కళాశాలలో కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు, ఆధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గుర్తేడు ఎస్ఐ సాయికుమార్ బుధవారం సందర్శించారు. విద్యార్థులకు కేరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు ర్యాగింగ్ వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మైనర్లు వాహనాలు నడపవద్దని, వాహనచోదకులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పక కలిగి ఉండాలని సూచించారు. గంజాయికి దూరంగా ఉండాలని హితవుపలికారు.ఆ కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు దయనీయంగా మారుతాయన్నారు. యువత, విద్యార్థులు అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలపాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి అనర్థాలపై విద్యార్థులు తమ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలను సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి బుధవారం సందర్శించారు. గంజాయి అనర్థాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి వల్ల జీవితాలు నాశమవుతాయని, వాటికి దూరంగా ఉండాలని హితవుపలికారు. గంజాయిని సమూలంగా నిర్మూలిద్దాం అని విద్యార్థులచే చేత ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి గురించి సమాచారం తెలిస్తే 9381123100, 9440900765 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కాలేజిలో ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలన్నారు.

రంపచోడవరం: యువత మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని రంపచోడవరం ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. రంపచోడవరం లెనోరా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. గంజాయి రవాణాపై సమాచారం ఉంటే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు.

# పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత


అరకులోయ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు


డుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహిస్తున్న కాఫీ బోర్డు, కళాశాల సిబ్బంది

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. విశాఖపట్నంలోని నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో చెత్త, చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉప సర్పంచ్ శెట్టి నిర్మల చందూ, వైస్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కె. పుష్పరాజ్, విశాఖ ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ జి.మహేశ్వరరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీఓలు వై.విజయలక్ష్మి, పి.నాగబాబు, మొష్యా అనిత కుమారి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛ భారత్ సాకారం చేద్దామని కాఫీ బోర్డు జూనియర్ లైజనింగ్ జూనియర్ అధికారి శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సినాల్ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రం డుంబ్రిగుడలో కాఫీ బోర్డు ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమన్ని చేస్తు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి మూడు రోడ్డు జంక్షన్ వద్ద మానవహారాన్ని చేపట్టారు. పరిసరాల శుభ్రతతో దోమల నివారణతో పాటు ఆరోగ్యకర జీవనానికి దోహదపడుతుందన్నారు. కాఫీ బోర్డు అధికారులు లక్ష్మి, రవికుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించాలని వినతి


ప్రత్యేకాధికారి అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

చింతూరు: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నాలుగు మండలాల వెలుగు వీఓఏలు బుధవారం స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ వీఓఏలకు పెండిగ్‌లో ఉన్న 9 నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ల కాలపరిమితి ఆదేశాలను రద్దు చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, రూ 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని వారు కోరారు. అనంతరం ప్రత్యేకాధికారి అంబేద్కర్‌కు వారు వినతి పత్రం అందజేశారు.నేతలు వెంకట్, సురేష్, శ్రీనివాసరావు, లక్ష్మణ్, సుందరి, లీలావతి, రత్నకుమారి, శిరీష పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణంతో గ్రామస్తుల హర్షం


పీవో అభిషేక్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

కొయ్యూరు: బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యులు సంజీవ్, గరిమండ గ్రామస్తులు ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. గరికబంద నుంచి గరిమండ వరకు రెండున్నర కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ఐటీడీఏ పీవో నెల కిందట గ్రామస్తులు హామీ ఇచ్చారు. ఆయన హామీ మేరకు జీఎస్‌డబ్ల్యూ రోడ్డు నిర్మాణం జరిగింది. రహదారి పూర్తి కావడంతో పీవోకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో గరిమండ నుంచి నల్లబిల్లి వరకు బీటీ రోడ్డు మంజూరై నిలిచిందని, దానిని కూడా పూర్తి చేయించాలని వారు కోరారు. కొద్దిరోజుల కిందట రహదారి సరిగా లేక పోవడంతో గొర్లెలమెట్టకు చెందిన ఒకరి మృతదేహాన్ని డోలిమోతపై తీసుకెళ్లిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

### నియోజకవర్గ అభివృద్ధికి కృషి

చింతూరు: కూనవరం మండలం అభిచర్ల, పెదార్కూరు, చింతూరు మండలం చట్టిలో బుధవారం జరిగిన ప్రజావేదికలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, రాజు, రమణారెడ్డి, ఆసిఫ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెనపై లైట్లు ప్రారంభం


శబరినది వంతెనపై లైట్లను ప్రారంభిస్తున్న జమాల్‌ఖాన్

చింతూరు: స్థానిక శబరినది వంతెనపై జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యుత్ లైట్లను ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వంతెనపై లైట్లు లేకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వరదల సమయంలో స్థానిక శబరిఒడ్డు ప్రజలు కూడా చీకట్లో గడపాల్సి వస్తోందన్నారు. దీంతో వారు వంతెనపై లైట్లు ఏర్పాటుచేయాలని కోరగా తక్షణమే లక్షన్నర రూపాయల వ్యయంతో లైట్లు వేయించినట్టు ఆయన తెలిపారు. వంతెనపై లైట్లు వేసిన జమాల్‌ఖాన్‌ను పలువురు అభినందించారు. ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్, రామారావు, శ్రీరామ్, సురేష్‌చౌదరి, తమ్మయ్య, రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


వంజరి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో సువర్ణమ్మ, సూపర్‌వైజర్లు

పాడేరు: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గబ్బంగి, ఈదులపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమాల్లో గబ్బంగి సర్పంచ్ గొల్లోరి నీలకంఠం, సలుగు ఎంపీటీసీ సభ్యురాలు చిప్పాడ మీనా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. రోజువారీ తీసుకునే ఆహారంలో ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని వంజరిలో జరిగిన కార్యక్రమంలో ఐసీడీపీ సీడీపీవో సువర్ణమ్మ మాట్లాడుతూ పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. పోషకాహారం ఆవశ్యకతను, బాల్య వివాహాల అనర్థాలను వివరించారు. సామూహిక సీమంతం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. సూపర్‌వైజర్లు లక్ష్మి, పద్మావతి, మణికుమారి, విజయలక్ష్మి, సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



ఎస్ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల: మండలంలో శాంతిభద్రత పరిరక్షణకు అందరి సహకారం అవసరమని ఎస్ఐ ఎస్.షణ్ముఖరావు చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో పనిచేసి బదిలీపై ఇక్కడ ఎస్ఐగా ఎస్.షణ్ముఖరావు బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసింది. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో శాంతిభద్రత పరిరక్షణకు ప్రజలు పోలీసులతో సహకరించాలని, ప్రజా సమస్యలు, ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అన్ని వేళలా ప్రజలకు పోలీసు సహకారం ఉంటుందన్నారు. పాడేరు రోడ్డు మార్గంలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేదుతామని, ఈ రోడ్డు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతామన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

# బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

చింతూరు: ఎటపాక మండలం దమ్మక్కగూడెంలో ఆదివాసీ మహిళ ఇంటిని కూల్చివేసిన భద్రాచలం దేవస్థానం అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన నిర్వహించిన అనంతరం ప్రత్యేకాధికారి అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ 2006 నుంచి నివాసముంటున్న ఆదివాసీలకు ప్రభుత్వం అన్ని ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్టు తెలిపారు. కాగా అవి దేవస్థానం భూములని వాటిని ఖాళీ చేయాలంటూ అక్కడ నివాసముంటున్న ఉయికా కాంతమ్మ అనే మహిళ ఇంటి కూల్చడం జరిగిందని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

### థియేటర్ పునఃప్రారంభం రేపు

రాజవొమ్మంగి: మండలం కేంద్రంలోని సినిమా థియేటర్ కొన్నాళ్ల క్రితం మూతబడింది. అయిదు దశాబ్దాల పాటు రాజవొమ్మంగితో పాటు అడ్డతీగల, కొయ్యూరు మండలాల్లోని సుమారు 200 గ్రామాల ప్రేక్షకులకు వినోదం పంచిన రాజవొమ్మంగిలోని వెంకటేశ్వర థియేటర్ ఆధునిక హంగులతో పునఃప్రారంభం కానుంది.థియేటర్ ఆధునికీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. శుక్రవారం విడుదల కానున్న జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమాతో థియేటర్ మరలా అందుబాటులో రానుండడంతో ప్రేక్షకులు సంబర పడుతున్నారు.

# ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు


వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

అరకులోయటౌన్: అరకులోయలో బుధవారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల ఎంపిక ముగిసింది. అరకులోయ క్రీడా పాఠశాల మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలుర విభాగంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, షెటిల్ వంటి క్రీడాపోటీలు నిర్వహించారు. 306 మంది చొప్పున 612 మంది బాలుర పాల్గొన్నట్టు అల్లూరి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కొండబాబు తెలిపారు. మంగళ, బుధవారాల్లో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలైన క్రీడాకారులు ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగే ఎంపికల్లో పాల్గొంటారన్నారు. స్కూల్ గేమ్స్ మాజీ సెక్రటరీ సూరిబాబు, అసిస్టెంట్ సెక్రటరీ కిల్లో బాలి, వ్యాయమ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కిల్లో అప్పలరాజు, భూపతిరాజు, కొండబాబు, బాలన్న, చందర్‌రావు, కమల్, శారద, అశోక్ కుమారి, ఆరు మండలాల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.